# ప్రతిపక్షం



**కొంపెల్ల విశ్వం**

రాజారావు మంత్రియి వుండి కూడా యితర మంత్రుల గురించి, ముఖ్యంగా మహామంత్రి గారికి ముఖ్యులైన వారి గురించి అసెంబ్లీలో అవాకులు చవాకులు వాగాడు. ఆయన పెదవి విప్పిన కారణంగా పదవిలోంచి పీకి యింటికి పొమ్మన్నారు. ఆనక పార్టీలోంచి కూడా బహిష్కరించామన్నారు. రాజారావు మాత్రం తక్కువ తిన్నాడా? (ఎంతయినా ప్రజా ప్రతినిధి కదా!) పార్టీ తనను బహిష్కరించలేదు, తనే పార్టీని బహిష్కరించానన్నాడు.

ఆ గొడవ అంతటితో సమసిపోలేదు. ఎలా పోతుంది!? మహామంత్రిగారి వెనక ఎలా అయితే ఆరు కోట్ల ఆంధ్రులున్నారో రాజారావు వెనకా అలాగే ఆరు కోట్ల ఆంధ్రులున్నారు. ఉన్నది అసలు ఆరుకోట్లే కదా, మరిద్దరి వెనకా చెరో ఆరుకోట్లు ఎలా వున్నారు— అవి ఎవ్వరూ అడగలేదు. కానీ వెంకట్రామయ్య, మాయ రోగమొచ్చి రాజారావును బర్తరఫ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం అంటూ ప్రకటనల మీద ప్రకటనలు కురిపించేశాడు. అంతటితో ఆగాడా!?

పాలకవర్గం శ్రీలంకలోని లిబరేషన్ టైగర్స్‌ను విమర్శిస్తే వెంకట్రామయ్య వాళ్ళను సమర్థించాడు.

'సతి' ప్రాబ్లెమ్‌ను పాలకవర్గం విమర్శిస్తే ఈయన ప్రశంసించాడు. ప్రధానమంత్రి విదేశాలన్నీ బలాదూరు తిరిగి, పైగా కోటిద్వీప్‌లో భార్యతో సహా (పాపం! తన భార్యతోనే) బహుత్ బడా ఖుషీ చేశాడు, ఎవడబ్బ సొమ్ముతో అని మహామంత్రి ఆవేశంగా అడిగేస్తే — మీరు అటీవల కాశ్మీరు, ఇటీవల నాగాలాండు ఎవడి బాబు సొమ్ముతో తిరిగి వచ్చారు అంటూ చెట్టంత మనిషిని పట్టుకుని కడిగేశాడు.

లోఫర్స్ సంగతేమిటని పాలకవర్గం ప్రశ్నిస్తే, ఈ వెంకట్రామయ్య తిన్నగా వుండకుండా మహామంత్రి అండ్ కో ప్లస్ పాలకవర్గ ప్రతినిధుల తాలూకు స్థిరచరాస్థి సంగతులు గుచ్చిగుచ్చి ప్రశ్నించి మోచేతి మీద కురుపులా సలపడం మొదలెట్టాడు.

దాంతో ఓ అత్యవసర ఆంతరంగిక సమావేశాన్ని ఏర్పాటు చేసింది పాలకవర్గం. దానికి పార్టీ ఛీఫ్ విప్ సుందరరామయ్య గారు కూడా వచ్చారు. ఆయన్ని చూసి అందరూ కళ్ళెర్ర చేశారు.

సదరు సుందరరామయ్య చేసిన మహాపరాధం ఏమిటంటే అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన వెంకట్రామయ్యకు అన్నగా పుట్టడం. అంచేత పెద్దగా రభస కాకుండా జాగ్రత్తపడి, తాను తమ్ముడితో మాట్లాడి అతని మాటలతూటాలను తుస్సుమనిపిస్తానని లోపాయకారీగా వాగ్దానం చేశాడు.

వాగ్దానమంటే చేశాడు కానీ ఎంత తమ్ముడైనా ఎక్స్ పార్టీలోవున్నవాడ్ని ఏకాంతంగా కలవడమంటేమాటలా? కానే కాదు. కానీ కలిశాడు. ఎక్కడ — పుణ్యవతి యింట్లో, రాత్రి పన్నెండు గంటలకు. అక్కడ, ఆ వేళపుడు అన్నగారిని చూసి కొంచెం ఆందోళ చెందాడు తమ్ముడు. తాను పుణ్యవతి కోసం రాలేదని నచ్చచెప్పి, పుణ్యవతిక్కూడా తెలీకుండా తమ్ముడ్ని తీసుకుని మేడ మెట్లెక్కాడు సుందరరామయ్య —

"ఏమిటన్నయ్యా యింతర్జెంటు!?"

"అర్జెంటేమిటి, నా బొంద —. పీకల మీదకు వస్తేనూ!"

మాట్లాడలేదు వెంకట్రామయ్య. ఊరుకోలేదు సుందరరామయ్య - "అసలు మనిద్దరం చెరో పార్టీ లోనూ ఎందుకున్నాం చెప్పు - ఏ పార్టీ పదవిలోకి వచ్చినా ఎవరో ఒకరు పదవిలో వుంటామనే కదా! అలాంటిది అదృష్టం బావుండి, నేనో పార్టీకి ఛీఫ్ విప్‌గా వుంటే నువ్వు అపోజిషన్ లీడరువై కేబినెట్ రేంకులో కొనసాగుతున్నావు."

"ఇప్పుడీ గొడవంతా దేనికి!?

"దేనికా!? ఈమధ్య పేపర్లలో నీ ప్రతాపమంతా చూపిస్తున్నావేమిటి?— అచ్చోసిన ఆంబోతు కనిపించిన ప్రతి గొడ్డుమీదకూ వెళ్ళినట్టు!?"

"ప్రతిపక్షం అన్నాక ఆమాత్రం మాట్లాడకపోతే ఎలాగ? నా పేరు ఏదో రూపంలో పేపర్లో వచ్చి నేనూ పాపులర్ కావాలిగా?"

"కావద్దని నేనన్డం లేదు. కానీ దానికీ ఓ మార్గం వుంది" అన్నాడు సుందరరామయ్య లంక పుగాకు చుట్ట వెలిగించుకునే ప్రయత్నం చేస్తూ. ఆయన్నే చూస్తూ వుండిపోయాడు వెంకట్రామయ్య. ఎందుకంటే సుందరరామయ్య కూడా ఒకప్పుడు అసెంబ్లీలో అపోజిషన్ పార్టీ లీడరే.

"పాలకవర్గం ఏది చెబితే అది కాదన్డం కాదు ప్రతిపక్షం పని. ఎడ్డెం అంటే తెడ్డెం అనడం ఎల్లప్పుడూ మంచిది కాదు. మంచిపని మావాళ్ళు చేస్తే అది చెడ్డదనడం వల్ల ప్రజల దృష్టిలో నువ్వు చెడ్డవాడివవుతావు. విమర్శలెప్పుడూ వ్యక్తిగతంగా చెయ్యొద్దు. మనుషులు శాశ్వతం కానీ పార్టీలు శాశ్వతం కాదు. ఏమో ఎవరు చెబుతారు, రేప్పొద్దున నువ్వే పాలకవర్గంలో వుండొచ్చు. అపుడు నీకూ యితర మంత్రులకు ఎడమొహం పెడమొహమేగా! అదే పార్టీని తిట్టావనుకో, పెద్ద ఇబ్బందుండదు. అసలు నా దృష్టిలో ఏ ప్రతిపక్షమైనా చేయాల్సిన విమర్శలు ఎలా వుండాలో చెబుతాను, విను—

"ప్రభుత్వం బస్సు రేట్లు పెంచిందనుకో - పెంచడం తప్పుకాదు, కానీ అంత ఎక్కువగా పెంచకుండా వుండాల్సింది అనాలి."

"హరిజనుల మీదో, ఆడవాళ్ళ మీదో అత్యాచారం జరిగిందనుకో - కమీషన్ వేసేవరకు గొడవ చేయాలి. వేసేక, యిక దానిగురించి పట్టించుకోకూడదు."

"దేవాలయాల మీద వచ్చే ఆదాయం ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగించాలి అని ప్రభుత్వం అంటే ఆ కార్యక్రమాలేమిటో చెప్పండి అని నిలదీసి ప్రశ్నించాలే తప్ప దేవుడి సొమ్ము వాడకూడదు - అని నువ్వనకూడదు. రేప్పొద్దున్న నువ్వున్న పార్టీ పదవిలోకి వస్తే ఆ డబ్బులో నీకూ వాటా వుంటుంది కదా!"

"ఇలాగే రిజర్వేషన్లు..." ఏదో చెప్పబోయాడు సుందరరామయ్య.

"ఇక చెప్పొద్దు ప్రతిపక్షం బాధ్యతేమిటో నాకు బాగా బోధపడింది" అన్నాడు వెంకట్రామయ్య గీతోపదేశం విన్న అర్జునుడిలాగ. గుంభనంగా నవ్వాడు సుందరరామయ్యగారు సాక్షాత్తూ శ్రీకృష్ణుడిలాగ. కృష్ణుడికి నెత్తిమీద నెమలి పింఛముంటే ఈయనకు నోట్లో చుట్టుంది.

ఈ గీతోపదేశం తర్వాత ప్రతిపక్షం బాధ్యతేమిటో గుర్తించిన వెంకట్రామయ్య మరెప్పుడూ "బాధ్యతా రహితమైన" ప్రకటనలు ఇవ్వలేదు. ◆

---

**కలిగిందాల్లోనే...**

"పండక్కి అల్లుళ్ళని, కూతుర్లని పిలిచావట ఏమి పెడతావేం" అంటూ ప్రశ్నించాడు పరంధామయ్య కాపీనపు బావమరిది కాంతయ్యని.

"కల్లో గంజో పెట్టి నాకు కలిగినదాల్లోనే అల్లుళ్ళకు గోచీగుడ్డలు, కూతుళ్ళకి బాడీలు పెడతానయ్యా. పండక్కి బట్టలు పెట్టలేదన్న అపవాదు మాత్రం నాకెందుకూ?" అన్నాడు కాపీనపు కాంతయ్య.

— శివకుమార్, విజయవాడ.